# మరోరకం మనిషి

సుమన్



కిటికీ లోనుంచి తోటలోకి చూశాను.

చీకటి వెలుతురు కసితీరా కౌగలించుకొంటు న్నాయి. గాలి వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లుగా ఆగి ఆగి వస్తోంది. ఆకాశం ఎర్రబడి కన్నీటి చారలు పులుము కుంది. బహుశా యిప్పటివరకు ఏడ్చి ఏడ్చి వుంటుంది.

వాతావరణం నాకు చాల ఆనందంగా వుంది.

ఇటువంటి వాతావరణంలో కూర్చోటం నాకు చాల యిష్టం. గంటల తరబడి అక్కడే కూర్చుని ఆనందం, హాయి అనుభవించేవాడిని.

అంతేకాదు, ఇటువంటి దృశ్యమే నాకు ఎప్పుడూ కనబడాలని కోరుకొనేవాణ్ని.

పడకుర్చీ తెచ్చి బయట వేసుక్కూర్చున్నాను.

ఆకాశం వంక చూస్తూ వెనక్కి వాలాను. పడ కుర్చీలో కూర్చున్న వాడెవడూ వెనక్కి వాలకుండా వుండలేడు.

ఇంకా కొంచెంసేపు వుంటే మసిబొగ్గులాంటి చీకటి పులుము కొంటుంది తోటలోనుంచి కీచు రాళ్ళమోత, అక్కడక్కడ మిణుగురు పురుగుల మెరుపులు, గూళ్ళకు చేరిన పక్షులు ఒకదాని నొకటి కోపంతో పొడుచుకుంటూ, మధ్యమధ్యలో విస్పృతంగా వస్తున్న అరుపులు విని నేను తన్మ యత్వం చెందేవాణ్ని.

అటువంటి తన్మయత్వం నాకు యింకా ఎక్కడా లభించేది కాదు

ఇంకా సూరిబాబు రాలేదనుకుంటా గేటు మూసి వుంది. సూరిబాబు వస్తే నేను యింత ఆనందంగా కూర్చోటానికి వీల్లేదు. వాడు నన్ను డిస్టర్బ్ చేస్తాడు.

వాడిది వెధవ మెంటాలిటీ

చాల సున్నితమైన ఆడపిల్లల భావాలు వాడివి అసలు వాడు ఆడపిల్లలానే వుంటాడు శరీరం చాల సున్నితంగా, చెంపలు, చేతులు, వేళ్ళు చాల మెత్తగా వుంటాయి. వాడు నవ్వితే ఆడపిల్ల నవ్వి నట్లే వుంటుంది. వాడినడకలో కూడ ఆడతనం కన బడుతూ వుంటుంది.

వాడంటే నాకు చాల కోపం ఎందుకంటే. ఎప్పుడూ ఆనందంగా వుంటాడు, నవ్వుతూ వుం టాడు. వాడినవ్వు చూసి నాకు మండి పోయేది

సున్నితమన్నా, నవ్వటమన్నా చెడ్డ చిరాకు నాకు. నవ్వటం ఓ పోజు. ప్రతివాడూ అదే పోజు పెడ తాడు. వీళ్ళను చూస్తే నాకు భలే చిరాకు

అన్ని విషయాలలోను నేను సూరిబాబు వ్యతి రేకులం నాకు, వాడికి పడదు వాడి అభిప్రాయాలు వేరు. నా అభిప్రాయాలు వేరు. మా యిద్దరి అభి ప్రాయాలు ఏనాడూ, ఏ విషయంలోనూ ఒక్కటి కాలేదు. అయినా యిద్దరం ఒకే గదిలో వుండ గల్గు తున్నాం. అదే ఆశ్చర్యం.

అసలు నాకు సూరిబాబుకి స్నేహం కలిసింది కూడ బహుశా పరస్పర విరుద్ధమైన మనస్తత్వం వలననేమో

మొదటిసారి నేను సూరిబాబు గదిలో వున్నపుడు అసూయ పుట్టింది వాడిని చూసికాదు, వాడి టేబిల్ మీదవున్న బొమ్మను చూసి

ఆ బొమ్మ ఎందుకంత అందంగా వుంది?

నాకు మహా చెడ్డ కోపం వచ్చింది ఇంకా అందం కోసం కాబోలు సూరిబాబు దానిచుట్టూ యిన్ని గులాబీలు పోశాడు.

బోడి గులాబీలలో ఏమి అందం వుంది?

క్షయరోగి కక్కిన రక్తపు ముద్దలులా వుంటాయి ఆ బొమ్మ అంత అందంగా వుండటానికి వీల్లేదు.

సూరిబాబు ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసి యిచ్చాడు. వాటిని త్రాగుతూ మండుతున్న గుండెతో చాలసేపు ఆలోచించాను.

సూరిబాబు ఏదో చెబుతున్నాడు తను జీవితాన్ని చాల హాపీగా గడిపేస్తాడట పువ్వులన్నా, మంచి హృదయమన్నా తనకి యిష్టమట. హాస్యం అంటే చెవి కోసుకుంటాడట (రెండుచెవులు బానే వున్నాయి. ఎప్పుడు కోసుకుంటాడో?) ఏదో చెబుతున్నాడు.

నేను వినటం లేదు.

కాసేపు అలా వాడు ఏకపాత్రాభినయం చేసిన తర్వాత 'ఏమైనా పోదాం, ముఖం కడుక్కొస్తాను' అని బాత్‌రూంలోకి వెళ్ళాడు

టేబిల్ మీద బొమ్మను నేను జేబులో పెట్టేసు కున్నాను. అలా దొంగతనం చేయుటంలో చాల హాయి అన్పించింది నాకు. నా అంతట నేనే నంతో షాన్ని పోగుచేసుకుంటున్నట్లుగా వుంది

తరువాత సూరిబాబు నేను బయటకు వచ్చే శాము. వాడితో అంతకుముందు కంటే చాల ఆనందంగా మాట్లాడాను. వాడితో కలిసి పోయి కేరింతలు కొట్టాను.

నా గదిలోకి పోయిన తర్వాత ఆబొమ్మను మరొక సారి చూశాను

ఎందుకింత అందంగా వుండాలి? ఎవడో స్టుపిడ్ చేసుంటాడు తనలో వున్న అసంతృప్తిని తీర్చుకోలేక యిటువంటిదాన్ని తయారు చేసి వుంటాడు

ఫ్రాయిడ్ ప్రకారం వాళ్ళంతా కవులు, శిల్పులు కళాకారులు. కాని నా ఉద్దేశం అదికాదు ధైర్యంలేక స్వజాతి సంపర్కంలో పడి తనలోని బలహీనతల్ని కప్పి పుచ్చటానికి అభినయించే ఓరకం క్రీచర్లు

నాకు రచయితలన్నా, కళాకారులన్నా సదభి ప్రాయం లేదు మరునాడు ప్రొద్దున్నే సూరిబాబు నాగదికి వచ్చాడు ఏడ్పు ముఖంతో. బహుశా రాత్రి

అంతా నిద్రపోయివుండడు కళ్ళు ఎర్రబడ్డాయి ముఖం పీక్కుపోయింది వాడిని అలా చూస్తూ నాలో నేనే ఆనందం పొందాను

'ఫూల్! నిన్న సాయంత్రం సభ్యత తెలియకుండా ఎంత సంతోషంగా వున్నాడు కేరింతలు కొడుతూ ఎగిరి పోయాడు.

కాని యిప్పుడు ఆ ముఖం చూడండి

వీడు ఎప్పుడూ యిలాగే వుంటే ఎంత బాగుణ్ణు

'ప్లీజ్ నా బొమ్మ నా కిచ్చేయ్ ఆ బొమ్మ నా ప్రాణం' అన్నాడు సూరిబాబు.

'ఏ బొమ్మ?' అడిగాను

'నిన్న నువ్వు పట్టుకొచ్చిన బొమ్మ.'

'నీకెలా తెలుసు నేను తెచ్చానని?'

'నిన్న నువ్వుతప్ప ఎవ్వరూ నాగదిలోకి రాలేదు నువ్వు ఆ బొమ్మవంక అనేకసార్లు చూడటం గమనించాను నీకది కావాలంటే మరెక్కడయినా కొనుక్కోవచ్చు కాని, దొంగతనం .. ఐ హేట్ యిట్ వెరీమచ్ '

నేను పగలబడి నవ్వాను వాడిని చూసి

'బొమ్మ తెచ్చుకోటం తప్పా, ఆ బొమ్మ నాకు కావాలి నువ్వు యివ్వవని నాకు తెలుసు నీకు తెలియకుండా తెచ్చుకోవటంలో తప్పేముంది?'

'తప్పే నేను సహించలేను ఆ బొమ్మ శారద నాకు యిచ్చింది ఆ బొమ్మలో శారదను చూసుకుంటాను ఆ చిలిపి నవ్వులు, అందమైన ముఖం ముందు వున్నట్లుగానే వుంటుంది '

నా కనుబొమలు ముడిపడ్డాయి విసుగ్గా అడిగాను

'శారద ఎవరు?'

'నాకు ప్రాణంతో సమానం చాల అందంగా వుంటుంది ప్రక్క పాపిడి, తెల్లటి పలువరస—కోల ముఖం, అందమైన నవ్వు, చక్కని నడక '

నాకు కోపం మండిపోయింది డర్టీ అందాన్ని గురించి వర్ణించుతున్నాడు రోగ్. గట్టిగా అరిచాను

'ఫూల్! ఐ ఓన్లీ అస్క్ హూయీజ్ శారదా?'

'నా మరదలు వైజాగ్‌లో బియస్సీ చదువుతోంది మేమిద్దరం ప్రేమించుకున్నాం పెళ్ళి చేసుకోవాలను కొంటున్నాం '

అలా చెప్పేటప్పుడు సూరిబాబు ముఖంలో అదోరకమైన తృప్తి నాకు కనబడింది వాడి ఎర్ర బడిన కళ్ళలో కూడ నాకు వింత వెలుగు కనబడింది. అది నేను చూడలేను సూరిబాబునే కాదు, ఏ మనిషినీ చూడలేను

ఏడుస్తున్న కళ్ళు ఎంత అందంగా వుంటాయి

'అయితే, ఆ బొమ్మ నీకు కావాలి కదూ?' అన్నాను కొంచంసేపు తర్వాత వాడిలోకి కోపంగా చూస్తూ

వాడు ఆశగా నావంక చూసి 'అవును కావాలి నువ్వు చాల మంచివాడివి యిస్తావని నాకు తెలుసు అందుకే వచ్చాను ' అన్నాడు

వాడిచేయి పుచ్చుకొని కిటికీ దగ్గరకు తీసుకు వెళ్లి బయటకు చూపించాను ఎండిపోయిన గడ్డి పరకల మీద ముక్కలు ముక్కలుగా వున్న బొమ్మని చూసి వాడు మారిపోయాడు కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఏడుస్తూ అన్నాడు. 'నన్ను చంపేశావ్ '

నేనేమీ మాట్లాడలేదు తరువాత వాడు చాల సేపు నాగదిలో వుండి వెళ్ళిపోయాడు. వాడు నా గదిలో వున్నంతసేపు నాకు సంతోషంగానే వుంది ఎందుకంటే వాడు ఏడుస్తున్నాడు గనుక

మళ్ళా ఆరోజు సాయంత్రం నాగదికి వచ్చిన సూరిబాబుని చూసి నేను ఆశ్చర్యపోయాను వాడితో పాటు సూట్‌కేసు, బెడ్డింగ్ వున్నాయి

'ఏమిటి యిలా వచ్చావు?' అడిగాను కనుబొమలు ముడిచి.

'యివ్వాల్టినుంచి నేను నీతోపాటే వుంటాను '

'ఎందుకని? నువ్వు యిక్కడ వుండలేవు?'

'ఇక్కడే వుండగలను నువ్వు ఒట్టి జంతువువి నా స్నేహంతో నిన్ను మార్చి వేస్తాను నువ్వు, నీ అభిప్రాయాలు అన్నీ మారిపోవాలి నువ్వు తిట్టినా బయటకు తోసినా వెళ్ళను '

నేను తిట్టలేదు, బయటకు తోయలేదు వాడు నా గదిలోనే వుండసాగాడు

సంవత్సరం తర్వాత కూడ నేను ఏమీ మారలేదు వాడి ప్రభావం నా మీద పడలేదు నేను మారటానికి అందరిలాగ చంచలుడ్ని కాదు నా అభిప్రాయాలు, నా మనస్తత్వం జీవితాంతం మారవు నా అభిప్రాయాల ఆరాధనలోను, నా మనస్తత్వపు నీడలోను నాకు ఎక్కడలేని సుఖం లభించుతుంది ఆ సుఖం చాలదూ బ్రతకటానికి?

నేను చిన్నప్పటినుంచి ప్రత్యేకంగా పెరిగాను బడి వదలిన తర్వాత గేటు తోసుకొని యింట్లోకి వెళ్ళటమంటే విసుగు పుట్టేది. కాంపౌండ్ వాల్ దూకి వెళ్ళేవాడిని. ఎవరు చెప్పింది వినేవాడిని కాదు నాకు తోచిందేదో చేసే వాడిని

చిన్నప్పటినుంచి ఆనందంగా వుండటం నాకు చాల యిష్టం ఆ ఆనందం నాకు జూలాయి వెధవలలా పువ్వులలోనూ, ఆడపిల్లల నవ్వులలోనూ, వాళ్ళ అందంలోనూ కనుపించేదికాదు. ఎవరైనా బాధ పడుతూవుంటే, ఏడుస్తూవుంటే సంతోషించేవాడిని దీర్ఘ వ్యాధితో మూల్గుతున్న వాడిని చూసి హాయిని అనుభవించేవాడిని. కురూపితనాన్ని, దరిద్రాన్ని మోస్తున్న ఆడవాళ్ళను చూస్తే నాకు తృప్తిగా వుండేది పిల్లలు నడుస్తూ జారిపడిపోయి కాళ్ళు చేతులు విరగ్గొట్టుకున్నా, నిప్పులో చేతులు కాల్చుకొని ఏడుస్తూవున్నా నన్ను నేను మరిచిపోయి చూసేవాడ్ని

ఆడించాలని యింటి చుట్టూవున్న పిల్లల్ని ప్రోగుచేసే వాడిని అందులో కొంతమంది చాల అందంగా వుండేవారు వాళ్ళను చూస్తే నాకు చాల అసూయగా వుండేది ఏమీ తెలియనివాడిలా వాళ్ళను గిల్లే వాడిని కొరికే వాడిని. వాళ్ళు కెవ్వుకెవ్వున ఏడ్చేవారు వాళ్ళు ఎంత ఎక్కువగా ఏడిస్తే అంత ఎక్కువ ఆనందాన్ని నేను పొందేవాడ్ని

ఈ ప్రపంచంలో ఎప్పుడూ సంతోషంగా వుండటానికి వీల్లేదు. ప్రతివాడు బాధతో చావవలసిందే ఆ బాధను చూస్తే నాకు చల్లటి అనుభూతి కల్గుతుంది

నాకు శాటాన్, రావణాసురుడు, ఎఖిల్స్, రాజనాల, ప్రాణ్ అంటే ప్రాణం. వాళ్ళ ఫోటోలు ఆల్బమ్‌లో పెట్టి రోజూ చూస్తూ వుంటాను నాకు మరొక శత్రువు వుంది అది ఆడవాళ్ళ అందం అందంగా వున్న ఆడవాళ్ళను చూస్తే నేను పిచ్చివాడినై పోయేవాడ్ని వాళ్ళ అందాన్ని హత్య చేయాలని, వాళ్ళు చాలా ఘోరంగా చచ్చిపోవాలని అనుకొనే వాడ్ని వాళ్ళు కురూపులుగా మారిపోతే ఎంచక్కా చూడొచ్చు అనుకొనేవాడ్ని.

గేటు తోసిన చప్పుడయింది

ఆలోచనలనుంచి తేరుకొని చూశాను

సూరిబాబు గేటువేసి నా దగ్గరకు వచ్చాడు. వస్తూనే అడిగాడు

'యివ్వాళ ఏమైనా ఉత్తరాలు వచ్చాయా?'

'రాలేదు' అన్నాను వాడి ముఖంలోకి చూసి

వాడి ముఖం జేవురించింది కొంచం నీరసించి పోయాడు

ఆ ఉత్తరం ఎక్కడినుంచి రావాలో నాకు తెలుసు శారద వ్రాస్తుంది రెండురోజులకో ఉత్తరమైనా వీడికి వ్రాస్తుంది ఉత్తరం వచ్చినరోజున కొండెక్కినంత సంతోష పడ్తాడు రాని రోజున కొండ మీదనుంచి పడ్డట్టుగా వుంటాడు

ఈ ఉత్తరాలు వ్రాసుకునే వాళ్ళను చూస్తే నాకు పరమ అసహ్యం ప్రత్యక్షంగా ఏమి చేయటానికి ధైర్యం చాలని వాళ్ళు ఉత్తరాలు వ్రాసుకోటం ద్వారా తీర్చుకుంటారు

సూరిబాబు నాకు ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుని అన్నాడు 'బహుశా శారద దగ్గరనుంచి యిదే ఆఖరిసారేమో నాకు లెటర్ రావటం '

'ఎందుకని?' అడిగాను

'చెప్పుకో చూద్దాం ' తల వెనక్కి చేతులుపెట్టి, కాళ్ళు ఆడించుతూ ఖుషీగా అడిగేసరికి నాకు కోపం వచ్చింది

'ఇంకెవడినో ప్రేమించి వుంటుంది కొన్ని రోజులలో వాడితో పెళ్ళయి పోతుంది పెళ్ళయిన తర్వాత వ్రాస్తే ఆ వెధవ ఊరుకోడు కాబట్టి యిప్పుడు ఓ అమర ప్రేయసిలో ఓ పోజుపెట్టి యిన్నిగ్గి జరిన్ కన్నీళ్ళు, వెన్నెళ్ళ ఉత్తరం వ్రాస్తుంది. అందమైన అడదాన్ని నమ్మవద్దని నేను చెప్పాను కాని నువ్వు నమ్మలేదు ఫూర్‌ఫెలో!'

'ఓరి అందమైన ఫూల్! శారద ప్రేమించిన మాట నిజమే. పెళ్ళాడే మాట నిజమే కొద్దిరోజులలో జరిగే మాట నిజమే. అయితే నాతోనే. పెళ్ళయిపోతే ఉత్తరాలు వ్రాసుకోవలసిన పని, నీ గదిలో వుండవలసిన పని వుండదు తెలుసా?' వాడి కళ్ళు మిలమిల మెరిసాయి

వెధవ పోజు, వీడూన్నూ— వీడొక్కడేనా ప్రేమించేది— వీడొక్కడేనా పెళ్ళి చేసుకొనేది - ఏమిటో వెధవ సంతోషం

'ఒరేయ్ శారద నిన్ను మోసం చేస్తే ఏం చేస్తావురా?' అడిగాను

'ఓరి పిచ్చివాడా శాడిస్టి రాక్షస సంతతి మైన అభిప్రాయాలురా సుఖం అంటే ఏమిటో నీకు తెలియదు నవ్వులోని చల్లదనం, పువ్వులలోని మెత్తదనం నీకు తెలియదు నువ్వు [illegible]'

నాకు కోపం నెత్తికి అంటింది చితక తన్నుదా మనిపించింది ఎముకలు విరగగొడ్తే పైత్యం కాస్త వదలి పోతుంది. కోపం తమాయించుకొని అన్నాను 'ఒరేయ్ నీలాంటి వెధవల్ని చాల మందిని ఎరుగు దును. ప్రేమ పేరుతో ఎన్ని అడ్డమైన పనులు చేసేది నాకు తెలుసు నాకు ప్రేమంటే నమ్మకం లేదు. నేను ఏ ఆడదాన్ని ప్రేమించను ఏ ఆడ దైనా ప్రేమించానని నావెంటబడితే కాల్చి పారే స్తాను'

'అది నీ ఖర్మ నేనేం చేయను?'

వాడు గదిలోకి పోయి బెడ్‌మీద వెల్లకిలా పడు కొని కొంచంసేపు రూఫ్‌కేసి చూసి కళ్ళు మూసు కున్నాడు

నేను కుర్చీ లోపలకు తెచ్చుకుని వాడివంక చూస్తూ కూర్చున్నాను.

కళ్ళు మూసుకుని వాడు ఆలోచించుతున్నాడు బహుశా, వాడూ శారదా టెక్నికలర్‌లో డ్యూయెట్ పాడుతూ వుంటారు సన్నగా జాలువారుతున్నమంచు క్రింద కౌగలించుకొని పడుకొని వుంటారు

యివేగా కలలు .........

మధ్యలో నవ్వుకొంటున్నాడు చెంపలమీద రంగు తృప్తిగా పులుము కొంటోంది

నాకు చిరాకు ముంచుకొచ్చింది. ఈ వెధవగాడి కలల్ని తలచుకొంటూ కూర్చోటం నాకెందుకు? అసలు వీడి మూలాన నేను తల ఎందుకు చెడగొట్టు కోవాలి?

మళ్ళా కుర్చీని బయటకు యీడ్చుకుపోయి దానిలో కోపంగా కూర్చున్నాను

బయట చీకటి చిక్క బడింది చలిగాలి మం దంగా మారటానికి అవస్థపడుతోంది గుడ్లగూబలు ప్రేమించుకుంటున్నట్లుగా పాడుతున్నాయి

# మరో రకం మనిషి

నేను బరువుగా కళ్ళు మూసుకున్నాను

నన్నెవ్వరూ ప్రేమించరు నేను ఎవరిలోనూ కలవను. సూరిబాబుకిలా నాకు ఏ శారదా ఉత్తరాలు వ్రాయదు—

ఎందుకని?

నాలోవున్న లోపం ఏమిటి? నేను బలహీనుడ్నా? సూరిబాబుకంటే శారదకంటే బలహీనుడ్నా? వాళ్ళ దారులకు వేరుగా నేను ఎందుకు ఎడుస్తున్నాను?

వారంరోజులు యిట్టే గడిపిన తర్వాత నేను ఆ గదిలో ఒంటరిగా కూర్చుని ఆలోచించుకొంటు న్నాను మాట మాటకి నాలో నాకు తెలియని అసంతృప్తి ముల్లులా గుచ్చుకొంటోంది

తలుపు తట్టిన చప్పుడయితే వెళ్ళి తలుపు తీశాను. కాకీ గుడ్డలతో దవడలు లోతుకు తోసుకు పోయి జుట్టు చిందరవందరగా పడి చెమటలు కక్కు కొంటున్న పోస్ట్‌మాన్ ఓ కవరు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు

సూరిబాబు అడ్రసు వుంది పైన

అది ఎక్కడి నుంచి వచ్చిందో యిట్టే గమ నించాను వెనక్కి తిప్పాను. అంటించిన చోట ఎవరూ చింపి చదవకూడదనే సిగ్నల్ కాబోలు పెన్సిలుతో గీతలు గీసి వున్నాయి

ఈ కవరులో సూరిబాబు భవిష్యత్ ఆధారపడి వుంది బహుశా శారదా వాళ్ళ నాన్నని పెళ్ళి విష యం అడిగి వుంటుంది డబ్బు వున్న తన కూతురి పెళ్ళి డబ్బులేని సూరిబాబుతో ఒప్పుకొని వుండడు యిక ఈ జన్మలో మనిద్దరికి పెళ్ళి జరగదని, మరచి పొమ్మని వ్రాసి వుంటుంది

నేననుకున్నట్లుగా జరగకపోతే .

నేననుకున్నట్లు జరిగిపోతే ప్రథమంగా సంతో షించేవాడ్ని నేనే

తలుపులు దగ్గరకు వేసి కవరు చించాను. అందులో యిలా వుంది.

డియర్ బావా!

నువ్వు వెంటనే బయలుదేరి రావాలి. మన కోరికలు ఫలించాయి నీకు ఆస్తిలేక పోయినా డాడీ నీకు, నాకు పెళ్ళి చేయటానికి ఒప్పుకున్నాడు. మనం ప్రేమించుకున్న విషయం కూడ చెప్పాను. త్వరలో ముహూర్తం కూడ పెట్టించేస్తాడు

డాడీ ఒప్పుకోడేమోనని ఎంతో పరితపించాను. నా కోరికలు ఫలించాయి, ఈ సంవత్సరంలో నేను చాల మారిపోయాను బావా పెంకితనం పోయింది. నన్ను చూసి నేనే ఆశ్చర్యపోయేంత మారిపోయాను. దీని కంతకు కారణం నువ్వే. నాకు లభించే అదృ ష్టాన్ని తలచుకొంటూ పొంగిపోతున్నాను. త్వరలో వివాహ మండపంలో కలుసుకుందాము.

నీ కోసం డాడీ, అమ్మా అంతా ఎదురు చూసా వుంటాము.

నీదాన్ని
శారద

చదువుతున్నంత సేపు నాకు వెర్రెత్తిపోయింది. గుండెలో పెట్రోలు కాలుతున్నట్లుగా వుంది.

ఎవడీ డాడీ వెధవ కూతురికి జవాబు చెప్పుకో లేని చవట వాజమ్మ

చాల సేపు ఆ డాడీగాడిన్ని బూతులు తిట్టాను. కవర్ని ముక్కలుగా చించి గదిలో ఓ మూల ప్రోగుగా చేసి అగ్గిపుల్ల గీశాను అవి మండుతూ వుంటే ఎంతో ఆనందం అనుభవించాను చాల హాయిగా నవ్వుకున్నాను

అవి పూర్తిగా కాలిపోయిన తర్వాత మసిని పోగు చేసి బయటకు విసిరాను గాలిలో కలసిపోయేట్లుగా.

సాయంత్రం ఆఫీసు నుంచి రావటంతోనే అడిగాడు సూరిబాబు 'నాకేమైనా ఉత్తరం వచ్చిందా?'

'రాలేదు' అన్నాను ముస్తకరిగా.

'యివ్వాళ కూడ రాలేదా?' వాడి మాటలలో నిరాశ అగుపించింది

'రాలేదు వస్తే నేను దాచుకుంటానా?'


'నువ్వు దాచుకోవు కాని, కాని యివ్వాళ రావలసింది' ఏదో గొణుగుతున్నాడు సూరిబాబు

ఆ రోజంతా వాడు నిరాశగానే వున్నాడు కారి యర్ భోజనం సరిగా తినలేదు రాత్రి సరిగా నిద్ర పోలేదు సిగరెట్లు చాల ఎక్కువగా కాల్చాడు. రాత్రి అంతా దగ్గుతూనే వున్నాడు

వారంరోజులు వాడు లెటరు కోసం ఎదురు చూస్తూనే వున్నాడు కాని వాడికి నిరాశ ఎదు రయ్యేది ఈ వారం రోజులలో వాడు చాల చిక్కి పోయాడు. ఎక్కువగా మాట్లాడేవాడు కాదు

వాడిలో కలిగే మార్పుల్ని నేను ఆనందంగా పరిశీలించుతూనే వున్నాను.

ఓ రోజు వాడు, పెట్టె, బెడ్డింగ్ సరు కొంటు న్నాడు.



'ఏమిటి?' అన్నాను ఆశ్చర్యాన్ని నటిస్తూ. ఇటువంటిది జరుగుతుందని నాకు తెలుసు. అయినా నేను బయట పడలేదు.

'శారద నన్ను మోసం చేసింది. బీదవాణ్ని పెళ్ళి చేసుకోటానికి దాని డాడీగాడు ఒప్పుకొని వుండడు. ఆడదాని విషయంలో యూ ఆర్ కరక్ట్.'

'ఒకవేళ శారద మోసం చేసినా నువ్వు పారి పోవలసిన అవసరంలేదు.'

'నేను బ్రతకలేను. ఈ ఉద్యోగం చేయలేను ఈ స్మృతులు కనుపించని చోటకు వెళ్ళిపోతాను. శారద తరపు నుంచి ఎవరైనా వస్తే చచ్చిపోయా నని చెప్పు.' అని చకచక నా మాట వినిపించుకో కుండానే బయటకు వెళ్ళిపోయాడు.

ఇప్పుడు గది చాల ఖాళీగా వుంది. చాల విశాలంగా వుంది. అటు యిటు గదిలో నాలుగైదుసార్లు సంతోషంగా తిరిగాను.

ఈ ప్రపంచానికంతకూ నేను రాజా అయినట్లు. ఓ బంగారు సింహాసనం మీద కూర్చొన్నట్లుగా ఫీలయ్యాను.

శారద మోసం చేసిందని వీడెక్కడికో పోయి ఆత్మహత్య చేసుకుంటాడు.

ఆ వార్త ఏ డైలీలోనో చదువుతుంటే నాకు ఎంత ఆనందంగా వుంటుంది. సంవత్సరం నుంచి నాలో రేగే మంటలు చల్లారిపోయి ఎంతటి మంచులాటి అనుభూతులు కల్గుతాయి...

కొన్నిరోజులు పోయిన తర్వాత పని వుండి వెళ్ళి అబిడ్స్‌లో ఫుట్‌పాత్ మీద నిలబడి సగం నరుక్కుపోయిన కాళ్ళతో పాకి వెళ్తున్న బిచ్చగాణ్ని చూసి ఆనందించుతున్నాను. వాడి జుట్టు చిందరవందరగా వుంది. సాకటానికి వాడు విపరీతమైన అవస్థ పడుతున్నాడు.

ఇంతలో ఓ చెయ్యి నా భుజం మీద పడింది. ఉలిక్కిపడి చూశాను.

సూరిబాబు నవ్వుతున్నాడు. ప్రక్కనే ఓ సుందరాంగి నిలబడి వుంది.

నేను ఆశ్చర్యపోయాను. వీడిక్కడెలా వున్నాడు. యింకా చచ్చిపోలేదా? ప్రక్కన ఆమె ఎవరు?

నా ఆశ్చర్యాన్ని గమనించాడు కాబోలు నవ్వుతూ అన్నాడు. 'ఈమె నా భార్య శారద.'

'నమస్తే' అంది శారద.

'నమస్తే' అన్నాను. నా గుండెలలో అగాధం చీల్చుకుపోతోంది.

'మరి?' నసిగాను.

'మరేంలేదు అపుడు నీ గదినుంచి తిన్నగా వెళ్ళి చచ్చిపోలేదు విశాఖపట్నం చేరాను శారద వాళ్ళ డాడీ పెళ్ళికి ఒప్పుకొనే వున్నాడు వెళ్ళగానే పెళ్ళయిపోయింది అంతా రోజులలో జరిగిపోయింది యిన్విటేషన్ పంపలేకపోయాను రా'

నాకేమీ సరిగా వినిపించటం లేదు.

'అప్పుడు శారద నాకు లెటరు వ్రాసిందట, ఎందుకని అందలేదో.'

వాడు నా వంక క్రీగంట చూస్తున్నాడేమో అనిపించి తలెత్తలేకపోయాను.

'ఆ వస్తాను అర్జెంటు పని వుంది. విష్ యూ ఎ హేపీ లైఫ్' అని వాడి చేయి గట్టిగా నొక్కి శారద వంక నిండుగా చూసి దూరంగా ఆగిన బస్సు కేసి చక చక అంగలు వేయసాగాను

చుట్టూ అంతా చీకటి పొరలు పొరలుగా కమ్ముకొంటోంది వెనుక నుంచి శారద, సూరిబాబుల నవ్వుల బాణాలు వీపుకు గుచ్చుకొంటున్నట్లుగా వున్నాయి.

వేగంగా అడుగులు వేసుకొంటూ బస్సుని చేరుకొని జనాల మధ్య నుంచి తోసుకుని ఎవడో ఏడుస్తూ వున్నా లక్ష్యపెట్టకుండా నా బూటుతో వాడి కాలిని కసితీరా నలిపి బస్సు ఎక్కాను.

బస్సు కొంచం దూరం వెళ్ళిన తర్వాత దీర్ఘంగా నిట్టూర్పు విడిచి అనుకున్నాను. 'ఒరేయ్ సూరిబాబూ! సంవత్సరం నుంచి శారద నీకు వ్రాస్తున్న లెటర్లు చాటుగా చదివి నీకు యిస్తున్నాని, వాటిని చదవటం వలన ఎప్పుడూ చూడని శారద రూపం నా గుండెల్లో స్థిరపడి పోయిందని నీకు తెలియదు.'

ఇక ముందెపుడూ తెలియనియ్యను.

